# రూట్‌కాజ్

సూరిబాబుకు పట్టరానంత కోపం వచ్చింది; ఆపుకోలేనంత ఆవేశం ముంచుకొచ్చింది. అతని రక్తం బుసబుసా పొంగింది. పిడికిళ్ళు బిగిశాయి.

నూనె గానుగా - కమ్ - రేషన్ కొట్టూ యజమాని అయిన శంకర్ మీదకు కస్సున లేచాడు.

శంకర్ ముందున్న పాత టేబిలు మీద గట్టిగా గుద్ది, "పదిమందికి పోశావో లేదో అప్పుడే కిర్సనాయిలు అయిపోయిందా?" అని దబాయించాడు.

చెక్కులు పోయిన కుర్చీలో చెక్కు చెదరకుండా కూర్చున్న శంకర్, సూరిబాబు దబాయింపులకు దడవ లేదు.

పైగా తాపీగా బీడీ వెలిగించి చెయ్యి విరిగిపోయిన పాత కుర్చీలో మడిగాళ్ళేసి, తన్నిపట్టి కూర్చుని, "అవునయ్యా, అయిపోయింది! నీవు ఏఁవిటంటావు?" అన్నాడు డ్రాయరు సొరుగును గట్టిగా లోపలికి నెట్టుతూ.

ఒకానొక ఆఫీసులో అకౌంటెట్ అయిన సూరిబాబుకి, ఈ రేకుల షెడ్డు రేషన్ కొట్టు బొజ్జ శంకరం తనకు ఇలా అమర్యాదగా జవాబు యివ్వటం చాలా అవమానమనిపించింది. తనచుట్టూ చూశాడు. తనతోపాటు తెల్లారగట్టనుంచి ఆశతో క్యూలో నిలబడిన వాళ్ళు ఇప్పుడు నిరాశగా ఖాళీ డబ్బాలు పట్టుకుని చుట్టూ మూగేరు.

సూరిబాబులో ఒక విధమైన కసి కదిలింది. వరుసగా మూడురోజుల్నుంచి తెల్లవారుఝామున అలారం పెట్టుకుని లేచి చలిలో సైకిలు త్రొక్కుకుంటూ వచ్చి డబ్బా పట్టుకుని క్యూలో గంటల కొద్దీ నిలబడుతున్నాడు. రోజూ యీ శంకరం గాడు నిక్కుతూ నీలుగుతూ ఎనిమిది గంటలకు కొట్టు తెరచి ఒక పదిమందికి పోసి, కిర్సనాయిలు అయిపోయిందని తన్నిపట్టి కూర్చుంటున్నాడు. అదేమిటని అడిగితే అది అంతే అంటున్నాడు. నిన్న సాయంకాలం నుంచీ పోస్తున్నాం, చాలామంది నిన్ననే తీసికొని పోయారు. మిగిలింది వీళ్ళకు పోశాను అంటున్నాడు. నిన్న ఎవరికి పోశావు, మేం ఎవ్వరమూ తీసికోలేదు గదా అని జనం గొడవ చేస్తే, దానికి నన్నేం చెయ్యమంటారు అని దబాయిస్తున్నాడు. రోజూ ఇదే తంతు. బ్లాకులో ఎంతమందికి ఎంత కావాలన్నా పోస్తాడు. మిగతా రేషన్ వస్తువులు - పంచదార, గోధుమలు, బియ్యం, వళ్లు తోముకొనే సబ్బులు - కూడా కోటా రాలేదని, తక్కువ వచ్చిందని, ఇలా సవాలక్ష సాకులు చెప్పి ఏ వొక్కటీ ఎవరికీ సరిగ్గా ఇవ్వడు. జనాన్ని వేధించుకు తింటున్నాడు. అన్నింటిని బ్లాకులో అమ్ముకుంటాడు.

సూరిబాబుకి ఇదంతా అతి దారుణం, ఘోర మోసంగా వుంది. అతనికి నాల్గు నెలల క్రితం క్రొత్తగా పెళ్ళయింది. నెలరోజుల క్రితం యీ సిటీలో క్రొత్త భార్యతో కాపురం పెట్టాడు. భార్య గ్యాస్ పొయ్యిల యింట్లోంచి వచ్చిన భాగ్యవంతుల పిల్ల. తనకు గ్యాస్‌పొయ్యి లేదు. స్టౌ వుంది. కాని స్టౌలోకి కిర్సనాయిల్ లేదు. నానా యాతనగా వుంది. బొగ్గుల కుంపటి మీద వంట చెయ్యటానికి తన క్రొత్త భార్య మహా ఇబ్బంది పడిపోతోంది. వంటంతా ఒక్క కుంపటి మీద కాక, టైంకు భోజనం అమరక తను రోజూ ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళవల్సి వస్తోంది.

బ్లాక్‌లో కొంటే పెద్దటిన్నే దొరుకుతుంది. ఆఫీసులో నిన్న ఒక గుమస్తా యిప్పిస్తానన్నాడు కూడా. కాని, సూరిబాబుకు బ్లాకులో కొనడం ఇష్టం లేదు. ఎక్కువ డబ్బులు పెట్టగలిగే స్తోమతా లేకకాదు. అది అతని ప్రిన్సిపల్‌కు వ్యతిరేకం!

సూరిబాబుకు చాలా ప్రిన్సిపల్స్ వున్నాయి. మరెన్నో ఆదర్శభావాలు ఉన్నాయి. ఈనాడు దేశంలో విశృంఖలంగా విజృంభిస్తోన్న అవినీతికి, లంచగొండితనముకు, దొంగ నిల్వలకు, కల్తీ సరుకులకు, అధికధరలకు సామాన్య ప్రజలు కూడా ఒక విధంగా కారకులని అతని అభిప్రాయం. వీట్ని ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రజలమీద కూడా వుందని అతని నమ్మకం. ఈ విషయాలల్లో ఈ మధ్య ప్రభుత్వం వారు తరచూ వెలిబుస్తోన్న అమూల్యమైన అభిప్రాయాలను ఆదర్శప్రాయంగా తీసికుంటాడు. ప్రజలు లంచాలు యివ్వబట్టే దేశంలో లంచగొండితనం ఈనాడు మూడుపూలూ ఆరు కాయలుగా వర్థిల్లుతున్నదంటాడు; ప్రజలు ఎంత ఖరీదైనా యిచ్చి కొంటున్నారు. కాబట్టే ఈనాడిలా ధరలు అదుపుతప్పి ఆకాశాన్ని తాకుతున్నాయంటాడు; 'కన్స్యూమర్స్ రెసిస్టెన్స్' వుండాలని అనే మన మంత్రుల మాటలు అక్షరాలా నిజం అంటాడు.

ఇప్పుడు రేషన్ కొట్టు శంకరం చెప్పిన పెడసరపు సమాధానం వినేసరికి, దేశంలో స్వార్థపరులయిన వ్యాపారస్థులు చేస్తోన్న అన్యాయాలను అక్రమాలను చట్టవిరుద్ధ చర్యలను ప్రజలే ఎదుర్కోవాలి, ప్రభుత్వ దృష్టికి తీసికొని రావాలి!' అనే మన పాలక ప్రభువుల వుద్బోధలు అతని చెవుల్లో మారుమ్రోగాయి. తనలో జీర్ణించుకుపోయిన ఆశయాలు గొంతెత్తి, హోరెత్తేటట్లు అరిచాయి. చేతులు ముడుచుకుంటే లాభం లేదనుకున్నాడు. గొంతెత్తవలసిందే అనుకున్నాడు.

శంకర్‌తో వాదనకు దిగేడు. నీ ఎకౌంట్ పుస్తకాలు బయటికి తీయ్. తీసికున్న వాళ్ళ పేర్లూ, సంతకాలూ చూపించు. అసలు నీకొచ్చిన స్టాకెంత, నిన్న నీవు ఎంతమంది కిచ్చావు, ఎంతిచ్చావు చూపించు అని లా పాయింట్లు లాగి మరీ దబాయించాడు.

సూరిబాబు లా పాయింట్లకు సమాధానంగా శంకర్ వెటకారంగా గొల్లుగొల్లున నవ్వాడు. అతని అలా నవ్వినప్పుడు, పంచెకూ, బనీనుకూ మధ్యన నిలవకుండా బయటికెళ్ళుకొచ్చిన అతని బొజ్జ యమ వుల్లాసంగా వూగిసలాడింది.

"ఏం బిడ్డా, నీవు - నా - ఎకౌంట్ పుస్తకాలు తనిఖీ చేస్తావా? అసలు నీవు ఎవ్వడివి నా పుస్తకాలు చూపించమంటానికి? నీలాంటి కోన్‌కిస్కా గాళ్ళకు ఈ శంకర్ దడవడు. జా, బేటా జా-" అన్నాడు తన బుర్ర మీసాలను గర్వంగా తిప్పుతూ.

తనని 'కోన్‌కిస్కాగాడు' అని అన్నందుకు సూరిబాబుకు విపరీతమైన రోషం వచ్చింది. ఎలుక కన్నం లాగా వున్న శంకర్ బొడ్లో అగ్గిపుల్ల గీసి పెట్టుదామన్నంత కోపం వచ్చింది.

శంకర్ షాపులో అతని అసిస్టెంట్స్ చేతులు వూపుతా చాల అగౌరవంగా, "జావ్‌మియా, జావ్!" అన్నారు, వాళ్ళకు తిరిగి హిందీలో సమాధానం చెప్పటానికి తనకు హిందీ రానందులకు తనమీద తనకే చిరాకేసింది.

బొడ్డు క్రిందకు కట్టిన నూనె మరకల చీరతో, పమిట మాటున నిలవని పొగరుబోతు రొమ్ములతో, రేగిపోయిన జుట్టుతో, సవరం మీద సవరం మూడు సవరాలు పెట్టి పిర్రల దాకా వేసిన తిత్తుల జడతో, బుగ్గన బిగించిన 'బాబా జర్దా' కిళ్ళీతో ఎర్రపడ్డ పెదాలతో, చిన్నసైజు నూనె గానుగ లాగా, గుమ్మటంగా యమ 'సెక్సీ'గా వున్న శంకర్ పడుచు పెళ్ళాం - "మా మావ శంకరం అంటే ఏటనుకున్నావో? ఈ పేటకే భయంకరం, ఎళ్ళెళ్ళవయ్యా పంతులూ!" అని భంకర్ భుజాలు పట్టుకుని వ్రేలాడుతూ కిలకిలా నవ్వింది.

సూరిబాబుకు ఆ పొగరుబోతు పడుచు మీద మండుకొచ్చింది. ఏ సవరానికా సవరం వూడదీసి ఆ పిల్లదాని చేతుల్లో పెట్టి, చెంప మీద ఛెళ్ళున కొట్టుదామన్నంత కోపం వచ్చింది.

కానీ, ఏమీ చేయలేకపోయాడు. అలా చేయగలిగిన సంస్కారానికి దిగజారలేదు. అతని లాటివాడు చేయగల్గిందొక్కటే! అక్కడికక్కడ. శంకర్ చేస్తోన్న చట్టవిరుద్ధ చర్యల మీద అధికారులకు కంప్లేంట్ చేస్తూ ఒక మహజరు లాంటి దాన్ని తయారు చేశాడు.

ఆ మహజరు మీద అక్కడ మూగిన జనంతో సంతకాలు పెట్టించాడు. అలా పెట్టిస్తూ మధ్యలో మళ్ళీ, "మర్యాదగా వీళ్లందరికీ కిర్సనాయిలు పోస్తావా? లేకపోతే ఈ రిపోర్ట్ ఛీఫ్ రేషన్ ఆఫీసరుకు పంపమన్నావా?" అని బెదిరించాడు.

శంకర్ నిర్లక్ష్యంగా "నీ యిష్టం వచ్చింది చేస్కో ఫో!" అన్నాడు.

- మళ్లీ ఈరోజు కూడా ఖాళీ డబ్బాను వూగులాడించుకుంటూ వుసూరుమంటూ యింటికి తిరిగి వచ్చిన భర్తను చూచి సూరిబాబు బార్య ఆదిలక్ష్మి ఎగతాళిగా, "మీ ఇందిరమ్మ ఏమందీ? మీ అరివీర భయంకర్ ఏమన్నాడూ?" అని అదేదో సినిమా పాట ట్యూనులో పాడుతూ పకపకా నవ్వింది.

సూరిబాబు తన ఆదర్శ భావాలను వల్లె వేయవల్సి వచ్చినప్పుడల్లా ప్రతిదానికి 'మన ఇందిరా గాంధీ ఏమందీ'- అని మొదలు పెట్టుతాడు.

ఈ సిటీలో క్రొత్తగా కాపురం పెట్టిన మొదటి రోజుల్లో ఒకసారి ఆదిలక్ష్మి పాలుగాచుకునే గిన్నె కొనుక్కుని రావటానికి బజారుకెళ్ళదామని తయారయింది. అప్పుడు సూరిబాబు భార్య మీదకు కస్సున లేచి, "మన ఇందిరా గాంధీ ఏమంది? తనెప్పుడు చూచినా (ఢిల్లీ) షాపుల్లో జనం విరగబడి అవసరమైన వస్తువులన్నీ కొంటుంటారంది. అవసరమైతేనే డబ్బు ఖర్చు చెయ్యాలంది. పొదుపు చెయ్యటం నేర్చుకోవాలంది. ప్రస్తుతం మన దేశం అతి క్లిష్టపరిస్థితుల్లో వుందని అంది..." అని ఇలా మన ప్రధాని సభల్లో ఏమేమి అన్నదో ఏకరవు పెట్టడం మొదలుపెట్టాడు.

పాపం, ఆదిలక్ష్మి బిత్తరబోయింది. తన పాలుగాచుకునే గిన్నెకూ, ఇందిరాగాంధీ అన్నదానికి ఏం సంబంధమో ఆమెకు అర్థం కాలేదు. అతనిచ్చిన ఉపన్యాసమంతా వోపిగ్గా విని, "ఇంతకీ గిన్నె

కొంటానంటూరా లేదా?" అని అడిగింది.

దానికి చచ్చినా కొనను. కొని దేశద్రోహిని కాలేను. అని గుండెలు చరుచుకుని మరీ చెప్పాడు.

ఆదిలక్ష్మి తల కొట్టుకుని 'ఏం [illegible] కర్మరా బాబూ!' అని అనుకుంది.

అలాగే ఇంకొకసారి ఆమె వీధిలో అమ్మకానికి వచ్చిన వెన్నపూస కొనబోయింది.

సూరిబాబు గుమ్మానికి అడ్డుగా నిలబడి సీరియస్‌గా "మన ఇందిరాగాంధీ ఏమందీ?' అన్నాడు.

ఆదిలక్ష్మి అమాయకంగా మొగం పెట్టి "నాతో ఏమీ అనలేదండీ!" అంది.

"నీతో ప్రత్యేకంగా అనాలా? ఇవ్వాళ పేపరు చూడలేదు? ప్రజలు త్యాగాలు చెయ్యాలనలేదు? సుఖాలు విడనాడాలీ అన్లేదు? ముఖ్యంగా మన ఆడవాళ్ళు (-ఛాఛా) మీ ఆడవాళ్ళు త్యాగాలు చెయ్యాలంది. దేశం అతి క్లిష్టపరిస్థితిలో వుంది. మనం వెన్నపూస వాడడానికి వీల్లేదు!" అని శాసించాడు.

అప్పటినుండి భర్తను, 'ఇందిరాగాంధీ పిచ్చోడు!' క్రింద జమ కట్టేసింది.

అందుకే ఇప్పుడు ఖాళీ డబ్బా పుచ్చుకుని వచ్చిన భర్తను 'మీ ఇందిరమ్మ ఏమందీ?' అని ఎగతాళిగా అంది.

భార్య అన్నదానికి సూరిబాబు రోషంగా, "మా ఇందిరా గాంధీ ఏమందా? ఈ శంకర్ లాంటి స్వార్థపరులను, దేశ ద్రోహులను 'సోషల్ బాయ్‌కాట్' చెయ్యాలంది" అని అన్నాడు.

"సోషల్ బాయ్‌కాట్ అంటే ఏం చేస్తారు?" అంది.

"ఏం చేస్తానో చేసి చూపిస్తాను; వుత్త మాటలు కాదు"

"అయితే 'గట్టి చేత'లన్నమాట!" అని తమాషాగా భుజాలెగరవేసి, "మీ చేతిలో ఈ కాగితాల పొత్తు ఏంటి?" అంది.

"ఈ పొత్తుతో ఆ శంకర్ గాడు చిత్తయిపోతాడు. వాడి ప్రాణాలు వీటిల్లో వున్నాయి!" అని గర్వంగా అన్నాడు.

వ్యంగ్యంగా, 'అయితే చిలకలో కాదన్నమాట!' అని ఆ కాగితాలు చూస్తూ కూర్చుంది.

సూరిబాబు గూట్లో సోప్ బాక్స్ తీసికొని స్నానం చెయ్యడానికి దొడ్లోకెళ్ళబోయాడు.

ఆదిలక్ష్మి కంగారుగా, "అయ్యయ్యో, అపచారం, అపచారం! మీచేతిలోది బ్లాకులో కొన్న లక్స్ సబ్బు సార్!" అంది.

ఆ మాట చెవినపడగానే సూరిబాబు తన చేతిలోవున్న దానివంక చూశాడు. అది ఒక పాములాగో, జెర్ర లాగో కనిపించింది. వెంటనే చేతిలో వున్న సోప్‌బాక్స్‌ను విదిలించి కొట్టాడు.

బజార్లో మామూలు సబ్బులు బ్లాకులో గాని దొరకటం లేదు. బ్లాకులో కొనటం అతనికి నిషిద్ధం. హైక్లాసు సబ్బులు వాడాలంటే 'ప్రజలు విలాస వస్తువులు వాడకూడదని ఆంక్ష పెట్టాడు. సబ్బులు మానేసి సున్నిపిండి వాడుదాం అని ప్రతిపాదించాడు. కాని, ఆదిలక్ష్మి 'నేను మాత్రం చచ్చినా సున్నిపిండి మాత్రం వాడను,' అని తను కాపురానికొస్తోన్నప్పుడు వాళ్ళమ్మ యిచ్చిన డబ్బులు పెట్టి బజారెళ్ళి ఆ బ్లాక్ ధరకే ఒక లక్స్‌సబ్బు కొనుక్కొని వచ్చింది. ఆరోజు సూరిబాబు పెద్ద రాద్ధాంతం చేశాడు; ఆ సబ్బును ముట్టనని ప్రతిజ్ఞ చేశాడు.

గిన్నెతో సున్నిపిండి తీసికెళ్ళుతున్న భర్తను చూచి ఆదిలక్ష్మి ముసిముసి నవ్వులు నవ్వుకుంది.

ఆరోజే ఆఫీసులో పర్మిషన్ పెట్టి ఎండలో చెమటలు కార్చుకుంటూ సైకిలు త్రొక్కి మూడుమైళ్ళు అవతల వున్న సివిల్ సప్లయి కార్యాలయానికెళ్ళి స్వయంగా ఆ మహాజర్ను అందచేసి దానిమీద తగు చర్య తీసికోమని మరీ మరీ చెప్పి వచ్చాడు.

* * *

సూరిబాబు మిరపకాయ బజ్జీలంటే బలే యిష్టం. వాట్ని ఆవకాయ పచ్చడి అన్నంలో నంజుకు తినటమంటే మరీ మహా యిష్టం. రోజూ బజార్నుంచి యింటికి వస్తూ దార్లో వున్న బంగారమ్మ 'రోడ్‌సైడ్' కొట్టు దగ్గర సైకిలు ఆపి, అప్పుడే వాయి తీసిన వేడివేడి బజ్జీలు కొనుక్కొని వస్తాడు.

ఆరోజు కూడా కొనుక్కొని వచ్చాడు. ఆదిలక్ష్మి తాపీగా నవ్వుతూ, "మీ భయంకర్ గాడి ప్రాణాలు మళ్ళీ మీ దగ్గరికే ఎగురుకుంటూ వచ్చాయి!" అని బజ్జీలకు కట్టిన కాగితాన్ని చూపించింది.

అది తను సి.ఆర్.వో. - ఆఫీసులో స్వయంగా అందజేసిన మహజర్‌లోని మొదటి పేజీ. ఆఫీసులో యిచ్చిన మహజర్ రోడ్‌సైడ్ బంగారమ్మ బజ్జీల కొట్టులోకి ఎలా వచ్చిందో సూరిబాబుకు అర్థం కాలేదు.

అతనికి అర్థం కాని దాని వెనకాతల ఒక చిన్న కథ వుంది. ఆ కథ ఏమిటంటే - ఆ ఆఫీసులో వేంకటస్వామి అని ఆఫీసు ప్యూను వున్నాడు. సూరిబాబు యిచ్చిన మహజర్ మీద ఆఫీసరు గారు పొట్టి సంతకం పెట్టి, వేంకటస్వామి కిచ్చి సెక్షన్‌లో యివ్వమన్నారు. అలా పొట్టి సంతకం పెట్టిన అప్లికేషన్స్‌ను ఎలా డిస్‌పోజ్ చెయ్యాలో వేంకటస్వామికి బాగా తెలుసు.

పాపం, సూరిబాబుకు లాగే మన వేంకటస్వామికి మిరపకాయ బజ్జీలంటే యిష్టం. అందులోనూ మందుకొట్టి వేడివేడి బజ్జీలను తినటం మరీ మరీ యిష్టం. రోజూ ఆఫీసు నుంచి వస్తూ పొట్టి సంతకం కంప్లేంట్లను జేబులో దోపుకుని వస్తాడు. (వాటిమీద సెక్షన్లో ఎలాటి యాక్షను వుండదు కాబట్టి, వూరికే ఫైల్ చెయ్యటం శ్రమ దండగ కాబట్టి! వాట్ని బంగారమ్మ కిచ్చి బదులుగా రెండో మూడో బజ్జీలు పుచ్చుకొని, సైరమ్మ సారా కొట్టులో వీట్ని నంజుకు తింటాడు.

ఈరోజూ అదే జరిగింది!

పాపం సూరిబాబుకు తింటున్న అన్నం సహించలేదు. ఒక విధమైన వుక్కురోషం వచ్చింది. ఏదో నాల్గుమెతుకులు తిని లేచాడు. ఆ నూనె మరకల కాగితాల్ని మడిచి వంకీన వున్న పట్లం జేబులో పదిలంగా పెట్టాడు. చీమలు పట్టుతాయని పెళ్ళాం ఒక ప్రక్కన మొత్తుకుంటున్నా పట్టించుకోలేదు. రాత్రి చాలాసేపటి వరకు ఏదో ఆలోచిస్తూండిపోయాడు.

ప్రొద్దుటే లేచి ప్రక్కింటి పరాత్పరరావు దగ్గరకూ, ఎదురింటి ఏకాంబరరావు దగ్గరకూ వెళ్ళాడు. రేషన్ కొట్టు శంకర్ చేస్తోన్న చట్టవిరుద్ధప్పన్లు గురించి ఏకరువు పెట్టాడు. "నిజమేనండీ, వాడు జనం పాలిట మహా శని గాడయిపోయాడు. పంచదార లేదంటాడు; సబ్బులు లేవంటాడు; బియ్యం స్టాకు రాలేదంటాడు. మళ్ళీ అన్నీ బ్లాకులో అమ్ముతాడు!" అని వాళ్ళూ వాపోయారు.

"మరి మనం వాడ్ని ఇలా వదిలెయ్యకూడదు. మన ప్రధానీ వాళ్ళూ చెప్పినట్లు మనమే ఈ సమస్యను పరిష్కరించాలి; వాడ్ని ఎదుర్కోవాలి." అని అన్నాడు ఆవేశంగా.

"అంటే ఏం చెయ్యాలంటారు?" అని వాళ్ళు అడిగేరు.

"ఏముందీ? వాడి కొట్టు ముందు మనం ధర్నా చెయ్యాలి. అవసరమైతే వాడ్ని ఘొరావ్ చెయ్యాలి!" వుద్రేకంతో వూగిపోతూ అన్నాడు.

"అలా చేస్తే పోలీసులు వచ్చి మనల్ని వేన్స్‌లో ఎక్కించుకుపోతారు. మన మన ఆఫీసర్లకు లా అండ్ ఆర్డర్‌కు భంగం కలిగిస్తోన్నామని ఫోనులు చేస్తారు; కంప్లేంట్లు యిస్తారు. మన కెరియర్ పాడవుతుంది; మన సర్వీసు రిజిస్టర్లో రెడ్ ఎంట్రీ పడుతుంది. వచ్చే ప్రమోషనులు పోతాయి. అందులోనూ నాపేరు ప్రమోషన్ పేనల్‌లో వుంది కూడానూ!" అని అన్నాడు ఏకాంబరరావు భయంగా.

"పోనీ రోజూ రెండుపూటలా వాడి కొట్టుముందు శాంతియుతంగా నినాదాలు చేద్దాం; ఒక రోజు కలెక్టరు కార్యాలయానికి వూరేగింపు తీద్దాం." అన్నాడు సూరిబాబు.

"మంత్రాలకు చింతకాయలు రాలుతాయా అన్నట్లు మన నినాదాలకు వాడు దడుస్తాడా? కాకపోయినా ఇవన్నీ చెయ్యటానికి సామాన్య సంసారులం మనకు టైం ఎక్కడ ఏడుస్తుందండీ?" అని సాగదీసుకున్నాడు పరాత్పరరావు.

"మీ పిచ్చిగానీ సూరిబాబు గారూ! వీళ్ళు చేస్తోన్న భాగోతం ప్రభుత్వానికి తెలియదంటారా? ఎన్నో డిపార్టుమెంట్స్, విజిలెన్స్ సెల్స్, ఇనస్పెక్టర్లూ, మన్నూ - మశానం. ఇంత మెషినరీ పెట్టుకుని ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చుంటె ఇహ మనకేనా పట్టిందీ?!" అన్నాడు ఏకాంబరరావు.

"వున్నాయనుకోండి! కానీ, మన కన్జ్యూమర్స్ రెసిస్టెన్స్ కూడా వుండాలిగా?" అని ఇంకేదో చెప్పబోయాడు సూరిబాబు.

"నా బొంద రెసిస్టెన్స్ - పొద్దున లేచిన కాడ్నుంచి ఇది లేదని, అది లేదని, దేవుల్లాడుకునే మన సంసారాలూ - ఆఫీసు గొడవలూ, పిల్లల చదువులూ, యింట్లో రోగాలూ, ఆసుపత్రులూ, మందులూ, మాకులూ, అప్పులు సప్పులూ - ఇలా ఎవరి ఏడుపు వాళ్ళు ఏడుస్తోన్నాం; ఎవరి చావు వాళ్ళు చస్తోన్నాం. ఇక మనకి రోడ్డునబడి నినాదాలు చెయ్యటానికి తగాదాలు పెట్టుకోవటానికి ఎక్కడ తీరిక చచ్చింది-?' ' అని వాళ్ళదారిన వాళ్ళు పోయారు - యింట్లో పని వుందని చెప్పి.

సూరిబాబు, "ప్రోగ్రెసివ్ థింకింగ్‌లేని వంటింటి వెధవలు!" అని వాళ్ళను మనస్సులో తిట్టుకుంటూ నీరసంగా యింటికి తిర్గి వచ్చాడు.

మళ్లీ ఆరోజు ఆఫీసులో పర్మిషన్ పెట్టి సి.ఆర్.వో. ఆఫీసుకెళ్ళాడు. ఆయనకు బజ్జీలకు కట్టిన కాగితాల్ని చూపించి, మీ ఆఫీసు ఇలా వుందని నాల్గు దులుపులు దులిపేడు.

ఆయన సూరిబాబును కూర్చోపెట్టి కాఫీ తెప్పించి ముందు శాంతపరిచాడు. జరిగినదానికి నొచ్చుకున్నాడు. ఏదో పొరపాటు జరిగి వుంటుందన్నాడు. తనే స్వయంగా ఈ విషయాన్ని ఎంక్వయిరీ చేస్తానన్నాడు. త ర్వాత సూరిబాబు పనిచేస్తోన్న ఆఫీసూ, తదితర వివరాలూ అడిగి తెల్సుకున్నాడు. సూరిబాబు ఆఫీసరు తనకు చిన్నప్పుడు క్లాస్‌మేట్ అనే విషయం తెల్సింది. అందరూ మీకులాగే వుంటే ఈ దేశమే బాగుపడిపోతుందని ప్రశంసించాడు. ఈ విషయంలో తగు చర్య తీసుకుంటానని హామీ ఇచ్చి పంపించాడు.

అతర్వాత ఆయన ఏమిచర్య తీసికున్నాడో ఏమో తెలియదు. శంకర్ గాడు మాత్రం తన చీకటి వ్యాపారాన్ని నిర్విఘ్నంగా సాగిస్తున్నాడు. పయిగా సూరిబాబు వాడి షాపుకెళితే వాడూ, వాడి పడుచు పెళ్ళాం, వాడి పరివారమూ సూటీపోటీ మాటలతో చులకనగా మాట్లాడి అతన్ని కించపరిచారు.

సూరిబాబు మనస్సు అవమానంతో కుతకుతలాడిపోయింది. ఒకరోజు ఆ ఏరియా కంప్లేంట్ ఇన్‌స్పెక్టర్ కనిపించాడు. తన కంప్లేంట్ మీద ఏం యాక్షన్ తీసుకున్నారని అడిగిన దానికి అతగాడు తేలిగ్గా 'ఇవన్నీ మాకు అలవాటేనండీ!' అని నవ్విపారేశాడు.

వెంటనే కూర్చుని సి.ఆర్.వో. మీదా, మిగతా అధికారుల మీదా ఒక రిపోర్టు తయారుచేసి ముఖ్యమంత్రికి, ప్రధానమంత్రికి పంపించాడు. పంపించాడన్న మాటే గాని ఈ రిపోర్టుల ద్వారా ఏమి సాధించలేను అనే శంక మనస్సులో పీకుతూనే వుంది.

శంకర్ గాడిలో మార్పు తీసుకొని రావాలంటే సోషల్ బాయ్‌కాట్ ఒక్కటే సరైన మార్గమని నిశ్చయించుకున్నాడు. ఈ విషయంలో ఇరుగువాళ్ళ సహకారం తనకు లభించనేలేదు. తనొక్కడే ఈ కార్యక్రమాన్ని అమలు జరపాలని నిశ్చయించుకున్నాడు.

తీవ్రంగా ఆలోచించి ఒక చక్కటి పథకాన్ని తయారు చేసుకున్నాడు. ఈ విషయం భార్యకు కూడా చెప్పలేదు.

మర్నాడు ప్రొద్దుటే లేచి శంకర్ యింటి వయిపు బయలుదేరాడు. ఆ యింటి సందు మొదట్లో కాపుకాశాడు. శంకర్ యింట్లో పాలుపోసి వస్తోన్న పాల మల్లయ్య సైకిల్ను అటకాయించాడు.

పాల మల్లయ్య కోపంగా, "ఏందీ?" అన్నాడు.

"నీవు రేపట్నుంచి ఆ శంకర్ యింట్లో పాలు పొయ్యడానికి వీల్లేదు!"

"ఎందుకు పొయ్యగూడదు? పొయ్యొద్దని చెప్పటానికి అసలు నీవోడివి?" అని చిరాకుగా అడిగాడు పాలమల్లయ్య.

ఆ శంకర్ 'సంఘద్రోహి' అని మొదలుపెట్టి, వాడు చేస్తోన్న చట్టవిరుద్ధప్పన్లు ఏకరువు పెట్టి, తను తలపెట్టిన 'సాంఘిక వెలి'ని గురించి వివరించి చెప్పాడు.

అంతా విని పాలమల్లయ్య, "ఏంటి పొంతులూ, నీవు సెప్పేది! నా వాడికలు పొయి, నా యాపారం చెప్పుతావా, నా నెత్తిన గుడ్డేసుకు పోవాలనా?" అన్నాడు కోపంగా.

సూరిబాబు ఇంకేదో చెప్పబోయాడు. దానికి, "మా సెప్పొచ్చావులేవయ్యా! నేను పాలు పోయకపోతే, ఈ సిటీలో ఇంకెవరూ పోయరా? నాలాంటి పాల సైకిళ్ళు వేలున్నాయి. మరాళ్ళు పోతారా? ఆళ్ళందర్నీ ఆపుతావా?.... వెళ్ళెళ్ళవయ్యా పిచ్చి పొంతులూ!" అని సైకిల్ ఎక్కి తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు.

సూరిబాబు [illegible] నిరాశుడైనాడు. మళ్ళీ వెంటనే ధైర్యం, హుషారూ కూడకట్టుకున్నాడు. ఇలాంటి విషయాల్లో ఆడవాళ్ళే సహకరిస్తారనుకున్నాడు. అందుకని 'కూరగాయలమ్మ'ల కోసం ఎదురుచూస్తూ ఆ సందుచివర మఠం వేసి కూర్చున్నాడు....

ఆ సాయంత్రం అయిదుగంటలకు - సూరిబాబు ఆఫీసు నుంచి ఇంకా యింటికి రాలేదు.

ఆదిలక్ష్మి స్నానం చెయ్యడానికి బాత్‌రూంలోకి వెళ్లడానికి సంసిద్ధమౌతుండగా ఎవరో వీధి తలుపులు దబదబా బాదారు.

ఆదిలక్ష్మి తలుపు తీసింది.

మల్లెపూల వాసన గుప్‌మని కొట్టింది. సెంటు వాసనలు మనిషి కంటే ముందే యింట్లోకి ప్రవేశించాయి. వాటి వెనుక ఒక యువతీమణి దూసుకుని లోపలికొచ్చింది.

వస్తూనే, "ఘూరిబాబు వున్నాడా?" అని అడిగింది. పాపం, ఆదిలక్ష్మి బిత్తరపోయి నోటమాట రాక ఆ సెంటు వాసనల రంగేళిని చూస్తూ నిలబడిపోయింది.

"ఏంటి మాటాడవు? అట్టా బెల్లం కొట్టిన రాయిలాగా సూత్తోన్నావు? ఘూరిబాబు యింటో వున్నాడా?" అని అంటూ ఆదిలక్ష్మిని ప్రక్కకు నెట్టుకు లోపలికెళ్ళింది.

గదులన్నీ చూచి మళ్ళీ ముందు గదిలోకి వచ్చి మంచం మీద కూర్చొని కాళ్లూగిస్తూ, "ఈ పెద్ద మనిషి యింకా యింటికి రాలేదా? అవతల సిన్మా టైం అయిపోతుంది..." అంది.

"నీవు యీ యింట్లో పనిమనిషివా? సూరిబాబు ఎప్పుడొస్తాడు?' అంటూ అలమరకున్న నిలువుటద్దం ముందుకెళ్ళి నిలబడి చూచుకుంది. పమిటను పదిసార్లు సర్దుకుంది. ముంగురులను షోగ్గా సవరించుకుంది. చీరను బొడ్డు కిందకు లాక్కొంది, టేబిల్ మీద నున్న పౌడరు చేతిలోకి యింత పోసుకొని మళ్ళీ మొగానికి పూసుకుంది.

ఆదిలక్ష్మి దండ కట్టుకుని టేబిలు మీద పెట్టుకున్న జాజిపూల దండను తలలో తురుముకుంది. టేబిల్ మీద వున్న సిన్మా బొమ్మల పత్రికను చూచి, "ఓలమ్మో, 'వానీసీ'నా?" అని పేజీలు త్రిప్పుతూ మంచంమీద వెల్లకిలా పడుకుంది. బొమ్మలు చూస్తూ మధ్యమధ్యలో నోట్లో కారాకిళ్ళీ వుమ్మును మంచం ప్రక్కన తుపుక్కున వూస్తోంది.

ఆదిలక్ష్మికి ఏడ్పు ముంచుకు వస్తోంది. కన్నీళ్ళు ఆగడం లేదు. "ఛీ, తన భర్త ఇలాంటివాడా? ఈ బజారు మనిషితో అతనికి పరిచయముందా? ఇద్దరు సిన్మాకు పోతారా?" ఇలా ఆలోచిస్తూ కుములుతూ, కుళ్ళుతూ బొమ్మలాగా నిలబడిపోయింది.

ఇంతలో సూరిబాబు వచ్చాడు. మంచం మీద వెల్లకిలా పండుకుని పుస్తకం చూస్తోన్న యువతిని, ఏడ్పు మొగం పెట్టుకుని ప్రక్కన నిలబడి వున్న భార్యను చూచి కంగారుపడిపోయాడు.

సూరి బాబును చూచి ఆ యువతి లేచి కూర్చుని, "ఏవయ్యా పెద్దమనిషి, ఇప్పుడా రావటం? అవతల నాకు సిన్మాకు టైం అయిపోతుంది, నా డబ్బులు భేగి పడేయి!" అని చేయి చాచింది.

సూరిబాబు, 'రేపటి డబ్బులు కూడ యిస్తోన్నా, రేపు ఇక్కడికి రావద్దు-" అని పదిరూపాయల కాగితం ఇచ్చాడు. పదిరూపాయలు తీసికొని ఆ పడుచు బయటికెళ్ళుతూ, "ఈ ముంగి పనిమనిషిని పెట్టుకున్నావా? రేపు ఇంకో మంచి పనిమనిషిని పట్టుకురమ్మంటావా!" అంది.

ఆదిలక్ష్మి తలుపులు మూసేసి భోరుభోరున ఏడుస్తూ "ఇదంతా ఏమిటండీ?" అని అడిగింది.

సూరిబాబు సీరియస్‌గా పోజు పెట్టి, "ఇదా, 'సాంఘిక వెలి!" అని అన్నాడు గంభీరంగా.

'సాంఘిక వెలి' అన్నమాట వినగానే ఆదిలక్ష్మి ఏడ్పు మానేసింది. సూరిబాబు గర్వంగా చెప్పాడు. "ఇప్పుడొచ్చింది కూరలమ్మే లచ్చి! నిన్నట్నుంచి ఆ శంకర్ గాడింటికి కూరలమ్మటానికెళ్ళటం మానేసింది. అందువల్ల ఆమెకు కలిగే నష్టానికి పరిహారంగా నేను డబ్బు యిచ్చాను."

ఇంతలో తలుపు మళ్ళీ ఎవరో దబదబా బాదారు. కూరలమ్మే రంగి, మంగి, సుబ్బి, పనిమనిషి ఎల్లమ్మ, గుడ్డలుతికే గంగి - ఇలా ఒకరి తర్వాత ఒకరు వచ్చి తలా రెండూ మూడూ పుచ్చుకుని పోయారు.

ఆదిలక్ష్మి "ఇలా ఎంతమందికి, ఎన్నిరోజులని డబ్బులు ధారపోస్తారు?" అని అడిగింది.

"ఎంతమందికయినా సరే,ఎన్నిరోజులయినా సరే. ఆ శంకర్ గాడికి బుద్ధి వచ్చేవరకు ఇలా జరగవల్సిందే! నేను బికారినయినా నా దేశంలో ఒక్క స్వార్థపరుడయినా మారాడు కదా అనే తృప్తి వుంటుంది!" ఆవేశంగా అన్నాడు.

"అయితే నిన్నా, ఇవ్వాళా ఆ శంకర్ యింట్లో కూరలే వుండుకోలేదా? మార్కెట్ కెళ్ళి తేర్చుకోలేరా?"

"తెచ్చుకోవచ్చు; వండుకోవచ్చు. రోజూ తనింటికి కూరలమ్మటానికి వచ్చే వాళ్ళు రావటం మానేశారని వాడు గ్రహిస్తే చాలు, నా పని అయినట్లే!"

నిజంగానే శంకర్ గ్రహించాడు; సూరిబాబు పనీ అయింది!

మర్నాడు రాత్రి సూరిబాబు స్టేషన్‌కెళ్ళి ఒక స్నేహితుడికి వీడ్కోలు చెప్పి, రైలు ఎక్కించి పదిగంటలప్పుడు యింటికి తిర్గి వస్తోన్నాడు. అప్పుడు వీధిలో దీపాలు ఆరిపోయి వున్నాయి. చీకటిగా వుంది. నిర్మానుష్యంగా వున్న సందులోంచి వస్తోన్న సూరిబాబును ఎవరో గుర్తు తెలియని గూండాలు అటకాయించి బాగా దేహశుద్ధి చేశారు. సూరిబాబు తల పగిలింది. చొక్కా రక్తంతో తడిచింది. చేతి ఎముక విరిగింది.

"వెధవను ఆ రిక్షాలో తీసికెళ్ళి ఆడింటిముందు పడేసి రాండి!" అని శంకర్ పురమాయించాడు.

"బాగా శాస్తి జరిగింది. లేకపోతే మా మావ మీద పైకి రిపోర్టులు పంపుతాడా; మా యింటికి కూరలమ్మే వాళ్ళు రాకుండా కట్టడి చేస్తాడా?" అంది శంకర్ పడుచు పెళ్ళాం.

మూడోనాటికి గాని సూరిబాబుకి స్పృహ రాలేదు. వంటినిండా కట్లతో మూల్గుతూ మంచంలో పడుకున్న భర్తకు సపర్యలు చేస్తూ ఆదిలక్ష్మి "మీ చాదస్తమే మిమ్మల్ని ఇంతదాక తీసికొచ్చింది" అంటూ మంత్రసాని దెప్పులు దెప్పుతుండగా మళ్ళీ యింటి తలుపుల్ని ఎవరో బాదారు.

సూరిబాబు ఆఫీసు మిత్రుడు రామారావు వచ్చాడు - అతన్ని చూచిపోవటానికి.

రామారావు కాసేపు సానుభూతి వచనాలు పలికి చివరికి ఇలా హితవు చెప్పాడు. "ఎవరు చేయవల్సిన పనులు వాళ్ళే చెయ్యాలి బ్రదర్! శంకర్ లాంటి సంఘద్రోహులను, చీడపురుగులను వేరి వెయ్యవల్సింది ప్రభుత్వం. సామాన్య పౌరులమయిన మనం కాదు. చెయ్యాలనుకుంటే ప్రభుత్వం నిముషాలమీద ఈ పని చెయ్యగలదు. ప్రభుత్వం చేయవల్సిన పనిని మనం చేస్తే ఇలాగే అవుతుంది! ఇదంతా ఒక విష వలయం - అసలు రూట్‌కాజ్ ఎక్కడుందో నీవు ఆలోచించటం లేదు!"

సూరిబాబు బుర్ర ఆలోచించటం మొదలుపెట్టింది.

- 'స్వాతి' మాసపత్రిక

★